
సాక్షి ఒడిశా

గురువారం । 22 । మే । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,69,300లు, బంగారం 100 మిల్లీగ్రాములు, వెండి 2 గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ముగిసిన పండగలు

అగ్ని గంగమ్మ పండగలు ముగిశాయి. ఆద్యంతం ఉత్సాహంగా పండగలు జరిగాయి.

- 8లో



పొహండిలో సంస్కరణలు

పొహండిలో పలు సంస్కరణలు చోటు చేసుకున్నాయి. సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

ఇసుక టిప్పర్ సీజ్



అధికారులు సీజ్ చేసిన టిప్పర్

రాయగడ: మూతపడిన ఇసుక రీచ్ నుంచి అక్రమంగా టిప్పర్‌లో ఇసుకను తరలిస్తుండగా ఓఎంసీ అధికారులు బుధవారం ఆకస్మిక దాడులను నిర్వహించి టిప్పర్ సీజ్ చేశారు. అలాగే రూ.4 లక్షల జరిమానా విధించి ఇసుకను లోడింగ్ చేసే జేసీబీ మెషిన్ కూడా సీజ్ చేశారు. జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి గుడారి సమీపంలో వంశధార నది వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న సమాచారం అందుకున్న ఓఎంసీ విభాగం జూనియర్ అధికారి రాజేంద్ర సేనాపతి నేతృత్వంలో ఒక టీమ్ ఆకస్మిక దాడులను నిర్వహించింది. ఈ క్రమంలో ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ని పట్టుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండడంతో పట్టుబడిన టిప్పర్ సీజ్ చేయడంతో పాటు భారీ ఎత్తున జరిమానా విధించారు.

ఆక్రమణల తొలగింపు పూర్తి



నిర్మాణాలు తొలగిస్తున్న దృశ్యం

కొరాపుట్: ఎంతో వివాదాస్పదంగా మారిన ఎంజీ రోడ్డు ఆక్రమణల తొలగింపు అధికారులు పూర్తి చేశారు. బుధవారం కొరాపుట్ జిల్లా జయపూర్ పట్టణంలోని ఎంజీ రోడ్డుకి అధికారులు జేసీబీలతో చేరుకున్నారు. సంగీత్ జంక్షన్ వద్ద భవనాలను నేలమట్టం చేశారు. వీటిని కూల్చడానికి గతంలోనే యజమానులకు కాల వ్యవధి ఇచ్చారు. అయినప్పటికీ యజమానులు వాటిని కూల్చలేదు. దీంతో అధికారులే రంగంలోకి దిగి మిగతా పని పూర్తి చేశారు. ప్రస్తుతం కూల్చిన నిర్మాణాల వలన అక్కడ నిర్మితమవుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు అడ్డంకిగా ఉండడంతో యుద్ధ ప్రాతిపదికన తొలగించినట్లు అధికారులు పేర్కొన్నారు.

బావిలో పడి ఎలుగుబంటి మృతి





ఎలుగుబంటిని బావి నుంచి బయటకు తీస్తున్న దృశ్యం

కొరాపుట్: వ్యవసాయ బావిలో పడి ఎలుగుబంటి మృతి చెందింది. ఈ సంఘటన కలహండి జిల్లా కెసింగా సమితి పాతిలా గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. రైతు బిరాజ్ పటేల్‌కు చెందిన వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు ఎలుగుబంటి పడిపోయింది. గమనించిన గ్రామస్తులు కెసింగా అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అగ్నిమాపక సిబ్బందితో కలసి ఎలుగుబంటిని బయటకు తీశారు. అపస్మారకస్థితిలో ఉన్న భల్లూకాన్ని సమీప పశువైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. ఎలుగుబంటి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు.

గోడకు కన్నం పెట్టి దుకాణంలో చోరీ



దొంగలు చేసిన గోడ కన్నంను పరిశీలిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి తర్లకోటా పంచాయతీలోని ఓ దుకాణంలో గోడకు కన్నం పెట్టి రూ.20వేలు సరుకులు దొంగిలించారు. గ్రామానికి చెందిన హరి హంతాల్ అనే వ్యక్తి కొన్నేళ్లుగా షాపు అద్దెకు తీసుకుని అక్కడే కిరాణా షాపు నడుపుతున్నాడు. రోజులాగానే మంగళవారం రాత్రి షాప్ మూసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం వచ్చి చూసే సరికి దొంగలు పడినట్లు గుర్తించారు. దీంతో కోరుకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐఐసి హిమాంశు శేఖర్ బారిక్ సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు.

ఉత్సవాలకు అంకురార్పణ

- జూన్ 2 నుంచి బురదల పోలమ్మ ఉత్సవాలు

రాయగడ: జూన్ 2వ తేదీ నుంచి జరగనున్న గ్రామ దేవత బురదల పోలమ్మ అమ్మవారి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉత్సవాల ప్రారంభానికి ప్రధాన ఘట్టమైన ముహూర్తపు రాట కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బార్జి జగన్‌మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు ఎద్దు శ్రీహరి, కోశాధికారి బొత్స శ్రీనివాస్‌రావు, పట్టణ ప్రముఖులు శిల్లా జగన్నాథరావు, ముంజేటి గంగాధర్‌రావు, చిన్నారి విజయ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు. సాంప్రదాయ ఆదివాసీ వాయిద్యాల నడుమ ముహూర్తపు రాట కార్యక్రమం జరిగింది. దీంతో ఉత్సవాల పనులకు శ్రీకారం చుడతారు.

చాటింపు

అమ్మవారి ఉత్సవాలు ప్రారంభానికి ముందు పట్టణంలో చాటింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈనెల 31వ తేదీ సాయంత్రం 4 గంటలకు చాటింపు కార్యక్రమం జరుగుతుంది. ఈ చాటింపు విన్న వారు ఉత్సవాలు ముగింపు రోజున తప్పనిసరిగా ఉండాలన్నది ఇక్కడి నమ్మకం. అదేవిధంగా పట్టణ ప్రజలు సాంప్రదాయాన్ని కొనసాగిస్తుండడం విశేషం.

ఉజ్జిడి బండి

జూన్ 1వ తేదీన ఉజ్జిడి బండి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. వెదురుతో తయారైన బుట్టను ఒక చిన్న బండిపై ఉంచి తెల్లవారుజామున బండిని లాగుకుంటూ వెళ్తారు. ఆ సమయంలో చద్ది అన్నం బుట్టలో వేస్తారు. దీంతో పట్టణం చల్లగా ఉంటుందని ఒక నమ్మకం.





ముహూర్తపు రాట కార్యక్రమం (ఇన్‌సెట్లో) పూజలందుకుంటున్న గ్రామదేవత బురదల పోలమ్మ

అమ్మవారి పాదాలు

ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన అమ్మవారి పాదాలు తీసుకువచ్చే కార్యక్రమం జూన్ 2వ తేదీ సాయంత్రం ప్రారంభమవుతుంది. స్థానిక భైరవీధిలోని దొర ఇంటి నుంచి పాదాలను తీసుకొచ్చి అమ్మవారి మందిరంలో ఉంచుతారు. దీంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. తొమ్మిది రోజుల పాటుగా జరిగే ఈ ఉత్సవాల్లో అమ్మవారి పాదాలను ప్రత్యేకంగా మెయిన్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన మండపానికి అమ్మవారి మందిరం నుంచి తీసుకెళ్లి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం 8వ తేదీన నీలధార, అదేరోజు రాత్రి ఉయ్యాల కంబాల, 9వ తేదీన అసర్లు, అదేరోజున నాయుడు, నాయురాళ్ల వేషధారణ, 10న అసర్లు, 11వ తేదీన ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు ఉంటాయి.

సీహెచ్‌ఎస్‌ఈ +2 ఫలితాలు వెల్లడి



రాష్ట్ర సీహెచ్‌ఎస్‌ఈ +2 ఫలితాల సంచికను విడుదల చేసిన విభాగం మంత్రి నిత్యానంద గోండ్

భువనేశ్వర్: రాష్ట్ర ఉన్నత మాధ్యమిక విద్యా మండలి (సీహెచ్‌ఎస్‌ఈ) నిర్వహించిన వార్షిక +2 పరీక్ష ఫలితాలను బుధవారం ప్రకటించారు. ఈ పరీక్షల సమగ్ర ఉత్తీర్ణత 82.77 శాతం నమోదైంది. ఈ సందర్భంగా రాష్ట్ర పాఠశాలలు, సామూహిక విద్యా విభాగం మంత్రి నిత్యానంద గోండ్, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ప్రశాంత కుమార్ పరిడా, సీహెచ్‌ఎస్‌ఈ అధికారుల సమక్షంలో రాష్ట్ర సీహెచ్‌ఎస్‌ఈ +2 ఫలితాల సంచికను విడుదల చేశారు. కార్యక్రమంలో విభాగం సెక్రటరీ షాలిని పండిట్, సీహెచ్‌ఎస్‌ఈ చైర్మన్ మృణాల్ కాంతి దాస్, ఉన్నత మాధ్యమిక విద్యా విభాగం డైరెక్టర్ రఘురామ్ అయ్యర్, సీహెచ్‌ఎస్‌ఈ పరీక్షల కంట్రోలర్ డాక్టర్ ప్రశాంత కుమార్ పరిడా, సీహెచ్‌ఎస్‌ఈ కార్యదర్శి శుభ్రబాల బెహెరా తదితర అధికారులు పాల్గొన్నారు. అర్హత కలిగిన విద్యార్థుల కోసం జూన్ నెలాఖరు నాటికి సీహెచ్‌ఎస్‌ఈ +2 తక్షణ (ఇన్‌స్టాంట్) పరీక్షను నిర్వహిస్తుందని తెలిపారు. ఈ ఏడాది మార్చి 18 నుండి 27 వరకు రాష్ట్రంలోని 30 జిల్లాల్లోని 1,276 కేంద్రాలలో జరిగిన వార్షిక సీహెచ్‌ఎస్‌ఈ 12వ తరగతి పరీక్షకు మొత్తం 3,93,618 మంది విద్యార్థులు దరఖాస్తు దాఖలు చేసి 3,82,729 మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. వారిలో 1,42,512 మంది బాలురు (77.88 శాతం), 1,74,251 మంది బాలికలు (87.24 శాతం) సహా 3,16,787 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 1,1,914 మంది అభ్యర్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. 67,815 మంది అభ్యర్థులు ద్వితీయ శ్రేణిలో, 1,43,339 మంది విద్యార్థులు తృతీయ శ్రేణిలో పాసయ్యారు. మరో 3 వేల 719 మంది అభ్యర్థులే కంపార్ట్‌మెంట్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. విభాగాల వారీగా ఉత్తీర్ణత శాతాన్ని పరిశీలిస్తే సైన్స్ విభాగంలో ఉత్తీర్ణత శాతం 77.49, ఆర్ట్సు విభాగంలో 80.51 శాతం, వాణిజ్య విభాగంలో 83.2 శాతం, వృత్తి విద్యలో 60.57 ఉత్తీర్ణత శాతం నమోదైంది. రీవాల్యుయేషన్, రీ-చెక్ కోసం దరఖాస్తు ఉత్తర్వులు ఈ నెల 30 నాటికి జారీ చేస్తారు. ప్లస్ టూ మార్కుల జాబితా, సర్టిఫికెట్ వంటి విద్యా పత్రాలను డిజీలాకర్.గొ.ఇన్ ద్వారా విద్యార్థులకు జారీ చేస్తారు. విద్యార్థులు 30 రోజుల్లోపు వారి పాఠశాలల నుంచి తమ సీహెచ్‌ఎస్‌ఈ మార్కుల జాబితా, సర్టిఫికెట్ల హార్డ్‌కాపీలను తీసుకోవచ్చు. ప్లస్ టూ ఫలితాలకు సంబంధించి విద్యార్థుల సందేహాలు పరిష్కరించడానికి హెల్ప్ లైన్ నంబర్ (టోల్ ఫ్రీ నంబర్) 0674 -2300907 జారీ చేశారు.

‘బాక్సైట్ తవ్వకాలు ఆపాల్సిందే’

రాయగడ: వేదాంత్ కంపెనీ జిల్లాలోని కాశీపూర్ సమితి కొడింగిమాలిలో గల బాక్సైట్ నిక్షేపాలు తవ్వుకుంటూ వెళ్లిపోతోందని, ఇది ఆమోద యోగ్యం కాదని కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక అన్నారు. మంగళవారం సమితి పరిధిలో గల పాడిపాడి పంచాయతీలోని మట్టికొన వద్ద వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు, నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపారు. ఇప్పటికే వేదాంత్ కంపెనీ మూడు మిలియన్ టన్నుల బాక్సైట్ తవ్వుకుని వెళ్లిపోయిందని, మరో 6 మిలియన్ల తవ్వుకునేందుకు ప్రభుత్వంతో మంతనాలు జరుపుతోందని అన్నారు. బాక్సైట్ నిల్వలు అయిపోతే కంసారిగుడలో ఏర్పాటు చేయనున్న కర్మాగారానికి నిక్షేపాలు మిగలవని ఆందోళన వ్యక్తం చేశారు. వేదాంత కంపెనీ ఇకపై కొడింగిమాలిలో బాక్సైట్ తవ్వకాలు చేపట్టకూడదని, లేదంటే ఆందోళన చేపట్టడం ఖాయమని అన్నారు. సమావేశంలో కొరాపుట్ లోక్‌సభ మాజీ ఎంపీ జిన్ను హికక, రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక, కొరాపుట్ జిల్లాలోని లక్ష్మీపూర్ శాసనసభ నియోజకవర్గం ఎమ్మెల్యే పవిత్ర సామంత, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, బీజేడీ సీనియర్ నాయకులు జగదీష్ పాత్రో, బినోద్ నాయక్, సమితి అధ్యక్షులు కొంతో మాఝి, సమాజసేవకుడు విద్యా దురియా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీ సప్తగిరి పక్కనే జిన్ను, అప్పలస్వామి తదితరులు

పంచాయతీ ఉప ఎన్నికలు వాయిదా

భువనేశ్వర్: పంచాయతీ సంస్థల ఉప ఎన్నికల సన్నాహాలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు జారీ చేసిన ఉప ఎన్నికల్ని వాయిదా వేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. వర్షాకాలం ప్రారంభం కావడంతో పంచాయతీ ఉప ఎన్నికలను వాయిదా వేసినట్లు పేర్కొంది. అంతకు ముందు ఈ ఏడాది జూన్ 23న ఖాళీగా ఉన్న 1,131 పదవులకు ఉప ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. వర్షాకాలం ముగిసిన తర్వాత తాజా ఉత్తర్వులు జారీ చేయడం జరుగుతుందని ఎన్నికల సంఘం కార్యదర్శి తెలియజేశారు.

ఒడిశా సాహస పర్యాటక గమ్యస్థానం: ముఖ్యమంత్రి



హాట్ ఎయిర్ బెలూన్ పర్యటన



ఉల్లాసభరిత ర్యాఫ్టింగ్

భువనేశ్వర్: భారతదేశంలో సాహస పర్యటన (అడ్వెంచర్ టూరిజం) అంటే ప్రజలకు మొదట గుర్తుకు వచ్చే పేరు ఒడిశాగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం అన్ని జిల్లాల్లో పర్యాటక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని యోచిస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన స్థానిక లోక్ సేవా భవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఒడిశా అడ్వెంచర్ టూరిజం మార్గదర్శకాలు - 2025 ను ఖరారు చేశారు. రాష్ట్రంలో వివిధ సహజ సుందర ఉత్తేజకరమైన ప్రకృతి రమణీయ ప్రదేశాలను 30 జిల్లాల్లో గుర్తించి అభివృద్ధి చేస్తారు. ప్రధాన సాహస పర్యాటక గమ్యస్థానాలుగా అభివృద్ధి చేయనున్నారు. ఈ సాహస పర్యాటకానికి సంభావ్య ప్రాంతాలను 30 జిల్లాల్లో గుర్తించి మ్యాప్ రూపకల్పనకు సన్నాహాలు చేస్తున్నారు. థ్రిల్ కోరుకునే వారికి రాష్ట్రాన్ని ప్రధాన గమ్యస్థానంగా మార్చడమే లక్ష్యంగా పేర్కొన్నారు. సతొకొషియాలో ర్యాఫ్టింగ్, హిరాకుడ్‌లో హాట్ ఎయిర్ బెలూన్ పర్యటన అభివృద్ధితో పాటు ఇతర ప్రదేశాలలో కూడా ఇలాంటి పర్యాటక సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రజలు భారతదేశానికి రావాలని ఆలోచించినప్పుడు, వారికి ముందుగా గుర్తుకు వచ్చేది ఒడిశా అని, సాహస పర్యటనకు అనుకూలంగా మలచి ఆకర్షణీయంగా మారుస్తామని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ గట్టి నమ్మకం వ్యక్తం చేశారు. ఇలాంటి ఆకర్షణీయమైన ప్రత్యేక పర్యాటక సౌకర్యాలు అంచెలంచెలుగా రాష్ట్ర వ్యాప్తంగా ఇతర వ్యూహాత్మక ప్రదేశాలకు విస్తరిస్తారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ థింక్ ఇండియా, థింక్ ఒడిశా దృక్పథంతో రాష్ట్రాన్ని ఒక శక్తివంతమైన సాహస పర్యాటక కేంద్రంగా మలిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ చొరవ ఒడిశా పర్యాటక సేవలను వైవిధ్యభరితం చేస్తుంది. దేశీయ మరియు అంతర్జాతీయ పర్యాటకుల ఆకర్షణను బహుముఖంగా పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. తాజా మార్గదర్శకాల ప్రకారం యువతకు జల, స్థల, గాలిలో తేలియాడే వివిధ సాహస పర్యాటక కార్యకలాపాలకు సంబంధించి శిక్షణ కల్పిస్తారు. ఈ మేరకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. దీని వల్ల వారికి భారీ ఉపాధి అవకాశాలు చేతికి అంది వస్తాయన్నారు. ఈ విషయంలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని కూడా ప్రోత్సహించనున్నారు. 'గో అడ్వెంచర్' పోర్టల్ ద్వారా ప్రైవేట్ రంగ భాగస్వామ్యానికి ఆమోదం లభిస్తుంది.

ఉత్తీర్ణులకు గవర్నర్ అభినందనలు

భువనేశ్వర్: రాష్ట్రంలో 12వ తరగతి ఉన్నత మాధ్యమిక విద్య పరీక్షల్లో విజయవంతంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నిరంతర మద్దతు, మార్గదర్శకత్వాన్ని ఆయన ప్రశంసించారు. విజయం, జ్ఞానం, స్థితిస్థాపకతతో నిండిన భవిష్యత్ కోసం ఆయన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

రక్తం ఇచ్చి ప్రాణం కాపాడి..



రక్తదానం చేస్తున్న మోహన్ సింగ్

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో ఉన్న రిక్లమేషన్ రైజింగ్ క్లబ్ ద్వారా బుధవారం ఓ యువకుడు రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాడు. మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రిలో ఛలాన్ గూఢ పంచాయతీ టిటిబిరి గ్రామానికి చెందిన భీమ మాడ్కమి అనే వ్యక్తి రక్తహీనతతో బాధపడుతూ సోమవారం ఆస్పత్రిలో చేరారు. రక్తం అవసరం పడడంతో కుటుంబ సభ్యులు ఎంత ప్రయత్నం చేసినా దొరకలేదు. దీంతో వెంటనే రిక్లమేషన్ రైజింగ్ క్లబ్ సలహాదారుడు లక్ష్మీనారాయణ శేఠిను సంప్రదించగా ఆయన మోహన్ సింగ్ అనే యువకుడితో మాట్లాడి రక్తదానం చేయించారు. దీంతో రక్తదాతను అంతా అభినందించారు.

పది క్వింటాళ్ల గంజాయి పట్టివేత



మల్కన్‌గిరి పోలీసులు అరెస్టు చేసిన గంజాయి నిందితులు

పికప్ వ్యాన్‌లో ఉన్న గంజాయి బస్తాలు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి సమితి గొడిగూఢ కూడలి వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న మల్కన్‌గిరి పోలీసులు మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఓ బొలేరో వాహనం నుంచి పది క్వింటాళ్ల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బండిలో ఉన్న ఇద్దరిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. బుధవారం తూకం వేయగా పది క్వింటాళ్లు ఉన్నట్లు తెలిపారు. నిందితులను కలిమెల సమితి ఎంవీ 81 గ్రామానికి చెందిన సుదేశ్ మిశ్రో (23), కోరుకొండ సమితి ఎంవీ 32 గ్రామానికి చెందిన సుజేన్ బేపారి (36)గా గుర్తించారు. వీరి నుంచి మూడు సెల్‌ఫోన్లు కొంత నగదు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ రూ.కోటి ఉంటుందని మల్కన్‌గిరి ఐఐసి రీగాన్‌కీండో తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి



తారావతి మృతదేహం

మల్కన్‌గిరి: పాముకాటుతో మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి చితపరి పంచాయతీలో చోటుచేసుకోగా.. ఆంతురి కిర్సాని భార్య తారావతి కిర్సాని (40) ప్రాణాలు కోల్పోయింది. చితపరి గ్రామంలో నివసిస్తున్న ఆంతురి కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి భోజనాలు పూర్తి చేసి పదిగంటల సమయంలో నిద్రపోతుండగా తారావతి పెద్ద కేకలు వేసింది. దీంతో ఆందోళన చెందిన కుటుంబీకులు లేచి చూసేసరికి విష సర్పం కన్పించింది. దీంతో శరీరాన్ని పరిశీలించగా తొడపై పాము కాటు వేసినట్టు గుర్తించారు. వెంటనే ఆమెను మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెంది. మృతురాలి సోదరుడు ఘెను బోడనాయక్ బలిమెల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఐఐసీ దీరాజ్ పట్నాయక్ కేసు నమోద్ చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఘోరం..!

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల దుర్మరణం



సుభత్ సాబొరొ (ఫైల్)



బులు సాబొరొ (ఫైల్)



బాలకృష్ణ హికక (ఫైల్)

రాయగడ: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం పాలైన ఘటన జిల్లాలోని రామనగుడ సమితి గుమడలోని వంశధార నది బ్రిడ్జిపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మృతి చెందినవారు పద్మపూర్ సమితి డెరిగా పంచాయతీలోని కొయితొగుడ గ్రామానికి చెందిన సుభత్ సాబొరొ(15), బులు సాబొరొ(19), జగన్నాథపూర్ గ్రామానికి చెందిన బాలకృష్ణ హికక (22)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న గుమడ పోలీసులు ఘటన స్థలంకు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభత్, బులు, బాలకృష్ణలు ఒక బైకుపై భామిని పంచాయతీలోని కెరిని గ్రామంలో జరుగుతున్న అమ్మవారి పండగను చూసేందుకు తమ గ్రామాల నుంచి మంగళవారం రాత్రి 11 గంటలకు బయల్దేరారు. అయితే వీరిని గుమడ సమీపంలోని వంశధార నది బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. దీంతో తీవ్ర గాయాలకు గురైన ముగ్గురు సంఘటన స్థలం వద్దే మృతి చెందారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఢీకొని వెళ్లిన వాహనం ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

రాజ్ భవన్ ఎదురుగా బీజేడీ ధర్నా



రాజ్ భవన్ ఎదురుగా బీజేడీ కార్యకర్తల ధర్నా

భువనేశ్వర్: విద్యాభ్యాసంలో ఇతర వెనుకబడిన వర్గాల (ఓబీసీ) పిల్లలకు సమాన అవకాశం కల్పించాలని విపక్ష బిజూ జనతా దళ్ గట్టిగా పట్టుబడుతోంది. ఈ వర్గీయులకు విద్యా రంగంలో 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే నినాదంతో బుధవారం స్థానిక రాజ్ భవన్ ఎదురుగా బిజూ జనతా దళ్ నిరసన ప్రదర్శించింది. ఈ ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఇటీవల ఓబీసీ వర్గాలకు 11.25 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు ప్రకటించింది. బీజేడీ దీర్ఘకాలంగా ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అభ్యర్థిస్తోంది. వైద్య, ఇంజినీరింగ్ విద్యా రంగాలలో ఓబీసీ విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పించాలని కోరింది. సాంకేతిక, ఉన్నత విద్యాభ్యాసంలో ఓబీసీ, షెడ్యూల్డ్ తెగలు, షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని విపక్షం డిమాండ్ చేస్తోంది. బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ నేతృత్వంలో రాజకీయ వ్యవహారాల కమిటీ ఏర్పాటు, కొత్త ఆఫీస్ బేరర్లను నియమించిన తర్వాత ఇది తొలి నిరసన ప్రదర్శన.



ధర్నాలో పాల్గొన్న కార్యకర్తలు

క్లుప్తంగా

రాయగడలో భారీ వర్షం



జోరువానలో తడుచుకుంటూ ఆటోలో వెళ్తున్న ప్రయాణికులు

రాయగడ: రాయగడ పట్టణంలో బుధవారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరింది. కాగా జోరు వానలో కూడా చాలామంది ఆటోల్లో ప్రమాదకరంగా తడుస్తూ ప్రయాణించడం కనిపించింది.

రేపు రాయగడలో మంత్రి కృష్ణ చంద్రపాత్రో పర్యటన



మంత్రి కృష్ణ చంద్రపాత్రో

రాయగడ: రాష్ట్ర పౌర సరఫరాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి కృష్ణ చంద్ర పాత్రో ఈ నెల 23వ తేదీన రాయగడలో పర్యటించనున్నారు. ఉదయం పది గంటలకు స్థానిక డీఆర్‌డీఏ సమావేశం మందిరంలో కొత్తగా నమోదైన లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేసే కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. అనంతరం 11 గంటలకు స్థానిక మున్సిపాలిటీ అడిటోరియంలో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారంలో భాగంగా రాజధానిలో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝికి సన్మానించే కార్యక్రమాన్ని వీక్షిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు బాకురుగుడలో నిర్మించిన ప్లానిటోరియాన్ని, 4.30 గంటలకు మెగా ఫుడ్ పార్క్‌ను సందర్శిస్తారు. సాయంత్రం ఐదు గంటలకు తిరిగి స్థానిక ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని కార్యకర్తలతో సమావేశమవుతారు. రాత్రి 8.50 గంటలకు స్థానిక రైల్వే స్టేషన్ నుంచి జున్నాగడ్ ఎక్స్‌ప్రెస్‌లో భువనేశ్వర్ వెళ్తారు.

గడ్డివాములు దగ్ధం

కాశీబుగ్గ: పలాస మండలం అమలకుడియా పంచాయతీ పూర్ణభద్ర గ్రామ సమీపంలో గడ్డివాములను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం తగలబెట్టారు. గ్రామానికి చెందిన కాయల హరికృష్ణతో పాటు మరో రైతుకు చెందిన ఐదెకరాల గడ్డివాములు ఈ ఘటనలో కాలిబూడిదయ్యాయి. పశువులకు ఏడాది పాటు సరిపడా గడ్డివాములు దగ్ధం కావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

సిక్కోలు విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు

బూర్జ/మందస/జలుమూరు: జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం తరఫున షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్నారు. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన వీరంతా మంగళవారం రాత్రి విజయవాడలో జరిగిన కార్యక్రమంలో విద్యా శాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా అవార్డులు స్వీకరించారు. అవార్డులు అందుకున్న వారిలో మందస మండలం హరిపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కంచరాన జ్యోషిత(597), బూర్జ మండలం ఓ.వి.పేట మోడల్ స్కూల్ విద్యార్థి బుడుమూరు ఉదయకిరణ్(593), జలుమూరు మండల కరవంజ మోడల్ స్కూల్ విద్యార్థిని రావాడ హేమశిరీష(592) ఉన్నారు. వీరిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

రణస్థలం: మండలంలోని మెంటాడ పంచాయతీ దోనిపేట సముద్రంలో గల్లంతైన నిద్రబంగి సంతోష్ మృతదేహం అదే ప్రాంతంలో బుధవారం లభ్యమైంది. నారువ గ్రామానికి చెందిన సంతోష్ (31)తో పాటు ఆళ్ల సూర్యనారాయణ, నీలాపు రమణ మంగళవారం సముద్ర స్నానానికి వెళ్లగా అందులో సంతోష్ గల్లంతైన విషయం తెలిసిందే. బుధవారం ఉదయం మృతదేహం ఒడ్డుకు రావడంతో కుటుంబ సభ్యులంతా కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌లో శవపంచనామా చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేశారు.

జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

కాశీబుగ్గ: జీడి పిక్కలు 80 కేజీల బస్తాకు రూ.16 వేలు ధర కల్పించి ప్రభుత్వమే రైతు సేవా కేంద్రాలు వద్ద కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కాశీబుగ్గ సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన జీడి రైతుల సమావేశంలో వారు మాట్లాడుతూ జీడికి గిట్టుబాటు ధర, జీడి కార్పొరేషన్ ఏర్పాటుపై ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు.

27న అమరవీరుల స్మారక సభ

పలాస: శ్రీకాకుళం జిల్లా గిరిజన సాయుధరైతాంగ పోరాటంలో అమరులైన అమర వీరుల స్మారక సభను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బొడ్డపాడులో జిల్లా అమర వీరుల స్మారక మందిరం వద్ద బుధవారం స్మారక సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ఎప్పట్లాగే ఈ ఏడాది కూడా మే 27న బొడ్డపాడులో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. సంఘాల నాయకులు జోగి కోదండరావు, వంకల మాధవరావు, దుష్యంతు, రామారావు పాల్గొన్నారు.

పొహండి నిర్వహణలో సంస్కరణలు



శ్రీ మందిరం సీఏఓ అధ్యక్షతన ఛొత్తీషా నియోగుల సమావేశం

భువనేశ్వర్:

పూరీ శ్రీ జగన్నాథ స్వామి వార్షిక రథ యాత్ర సన్నాహాలు ఊపందుకుంటున్నాయి. యాత్ర నిర్వహణలో ఛొత్తీషా నియోగుల పాత్ర ప్రాముఖ్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో శ్రీ మందిరం ఛొత్తీషా నియోగుల సమావేశం విజయవంతంగా ముగిసింది. రాజేంద్ర అభిషేకం మొదలుకొని నీలాద్రి విజే వరకు కార్యక్రమాల ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. ఈ ఏడాది స్నాన యాత్ర, రథ యాత్ర, బహుడా యాత్ర కార్యాచరణ ఈ సమావేశంలో ప్రధానాంశాలుగా చర్చించినట్లు శ్రీ మందిరం ప్రధాన నిర్వాహకుడు డాక్టరు అరవింద కుమార్ పాఢి తెలిపారు. ఆయన అధ్యక్షతన బుధవారం మందిరం కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. ఈ ఏడాది కార్యాచరణలో స్వల్ప సంస్కరణలు చేపట్టినట్లు వివరించారు. గత ఏడాది గుండిచా యాత్ర పురస్కరించుకుని నిర్వహించిన అడప పొహండిలో ఘోర తప్పిదం చోటు చేసుకుంది. బలభద్రుని మూల విరాట్ నేలకొరిగిన విషయం విదితమే. ఇదో దుర్ఘటనగా భక్త జన హృదయాల్ని కలచి వేసింది. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా నివారించేందుకు సమావేశానికి హాజరు అయిన సేవాయత్ ప్రతినిధులు పలు ప్రతిపాదనలపై చర్చించారు. ప్రధానంగా దైతపతి, ఛొత్తీషా నియోగుల సంఘం ప్రముఖుల ప్రతిపాదనలపై లోతుగా చర్చించారు. యాత్ర ఆద్యంతాల్లో మూల విరాట్ల తరలింపు పొహండిపై ప్రత్యేక శ్రద్ధతో దృష్టి సారించాలని వీరంతా ప్రతిపాదించారు. స్నాన యాత్రలో జల అభిషేకం అత్యంత పవిత్రమైనది, ప్రముఖమైనది. ఈ సందర్భంగా అభిషేక మండపానికి జలం తరలిస్తున్న పాత్రలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ మేరకు కట్టుదిట్టమైన క్రమశిక్షణ మార్గదర్శకాలు జారీ చేయనున్నారు. భక్తులకు సులభ దర్శనం కోసం అనుబంధ సేవాయత్ వర్గీయులు పూర్తి సహకారం అందజేస్తామని సమావేశంలో హామీ ఇచ్చారు. స్నాన యాత్ర, రథ యాత్ర, బహుడా యాత్ర, నీలాద్రి విజే ఉత్సవాల నిర్వహణపై ప్రధానంగా సమయ పాలన, క్రమశిక్షణకు సంబంధించి విస్తారంగా చర్చించారు. నవ యవ్వన దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చర్చనీయాంశంగా పేర్కొన్నారు.

పొహండి సంస్కరణ

మూల విరాటుల తరలింపు పొహండి అత్యంత కీలకమైన ఘట్టం. ఈ కార్యాచరణలో సరికొత్త సంస్కరణకు ఛొత్తీషా నియోగుల సమావశంలో ఆమోదం లభించింది. ఒక్కో మూల విరాటు కోసం ప్రత్యేకంగా ఒక్కో సీనియర్ అధికారి, శ్రీ మందిరం పోలీసులుని నియమిస్తారు. పొహండికి ముందుగానే రథాలకు చారుమళ్ల అమరిక పటిష్టంగా పూర్తి చేస్తారు. ఈ ప్రక్రియని దైతపతి సేవాయత్‌లు, బాడొగ్రాహి సేవాయత్‌లు, భొయి సర్దారు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. రథాలకు చారుమళ్ల ఏర్పాటులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఈ వర్గాలు జాగ్రత్త వహిస్తాయి. నిర్ధారిత వేళల ప్రకారం ఆలయ ఆచార వ్యవహారాలతో యాత్ర కార్యకలాపాలు ముగించి యాత్ర నిర్విఘ్నంగా విజయవంతం చేసేందుకు అన్ని వర్గాలు భక్తి భావంతో పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని ఈ సమావేశంలో అభయం ఇచ్చారని శ్రీ మందిరం సీఏఓ తెలిపారు.

త్వరలో కొత్త పాలక మండలి

త్వరలో శ్రీ మందిరం కొత్త పాలక మండలి ఏర్పాటు అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం కోసం నిరీక్షిస్తున్నారు. కొత్త మండలి ఏర్పాటయ్యేంత వరకు అధికారిక వర్గాల ప్రతినిధుల ఆధ్వర్యంలో పాలక మండలి కార్యకలాపాలు నిరాటంకంగా కొనసాగుతాయని సీఏఓ తెలిపారు. పూరీ గజపతి మహా రాజా దివ్య సింగ్ దేవ్ అధ్యక్షుడు, శ్రీ మందిరం ప్రధాన నిర్వాహకుడు కార్యనిర్వాహక అధ్యక్షుడు, పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంటు, కలెక్టరు, భారత పురావస్తు శాఖ ప్రముఖులు తదితర వర్గాల ఆధ్వర్యంలో పాలక మండలి కార్యకలాపాలు కొనసాగుతాయని వివరించారు.

భవానీశంకర్ జెన్నకు రాజీవ్‌గాంధీ ప్రతిభా పురస్కారం



పీసీసీ అధ్యక్షుడు భక్తచరణ్ దాస్ చేతుల మీదుగా అవార్డును తీసుకుంటున్న జెన్న

రాయగడ: స్థానిక సమాజ సేవకుడు, ట్రేడ్ యూనియన్ నాయకుడు భవానీశంకర్ జెన్నకు రాజీవ్ గాంధీ ప్రతిభా పురస్కార్ -25 అవార్డు లభించింది. ఒడిశా రాష్ట్ర రాజీవ్ గాంధీ స్టూడెంట్స్ ఫోరం ఆధ్వర్యంలో రాజధాని భువనేశ్వరలో బుధవారం స్వర్గీయ రాజీవ్ గాంధీ 34వ వర్ధంతిని పురస్కరించుకుని జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డును జెన్నకు అందజేశారు. పీసీసీ అధ్యక్షుడు భక్తచరణ్ దాస్, ఉత్కల్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ బినాయక్ కర్, ఓఆర్‌జీఎస్‌ఎఫ్ అధ్యక్షుడు సత్యబ్రత నాయక్ సమక్షంలో అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా జెన్నకు పలువురు అభినందించారు.

ముగిసిన అగ్నిగంగమ్మ పండుగ



ఘటాలను పాదాల గుడికి తీసుకువెళుతున్న భక్తులు



నిప్పులపై నడుస్తున్న పూజారి

రాయగడ: స్థానిక పిట్టలవీధిలో ఐదు రోజులుగా జరుగుతున్న అగ్నిగంగమ్మ అమ్మవారి వార్షిక పండుగ బుధవారంతో ముగిసిది. మంగళవారం రాత్రి పండుగలో ప్రధాన ఘట్టమైన మల్లెల్లో (నిప్పులపై) పూజారి నడిచే కార్యక్రమం జరిగింది. బుధవారం పండుగ సమయంలో స్థానిక కేఎస్‌కే సమీపంలోని అమ్మవారి పాదాల గుడి నుంచి తీసుకువచ్చిన పాదాలను తిరిగి అదే స్థానానికి తీసుకువెళ్లారు. మేళ తాళాలు, ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాలతో అమ్మవారి ఘటాలతో పాటు పాలజంగిడిలో పాదాలను మోసుకుంటూ పాదాలగుడిలో నిలపడంతో పండుగ ముగిసింది. యువతకులు, వీధి ప్రముఖులు పెద్ద సంఖ్యలో నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు.

సమాచారం లేకుండా సమావేశాలకు ఎందుకు?



వేదికపై కలెక్టర్ కీర్తి వాసన్, ఎంపీ సప్తగిరి ఉల్కా, ఎమ్మెల్యే తారా ప్రసాద్, రాం ఖడం, పవిత్ర శాంత, రఘురాం మచ్చో, సస్మితా మెలక

- అధికారులను నిలదీసిన ఎమ్మెల్యే

కొరాపుట్: సమగ్ర సమాచారం లేని అధికారులు సమావేశాలకు ఎందుకు వస్తున్నారని కాంగ్రెస్ పార్టీకి చెందిన జయపూర్ ఎంఎల్ఏ తారా ప్రసాద్ భాహీని పతి ప్రశ్నించారు. బుధవారం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో జిల్లా అభివృద్ధి కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (దిశా) సమావేశంలో ఎమ్మెల్యే మండిపడ్డారు. కొరాపుట్, జయపూర్ పట్టణాలలో నిర్మితం అవుతున్న బైపాస్ రోడ్డు నిర్మాణ ప్రగతిని సభ్యులు అధికారులను ప్రశ్నించారు. జిల్లాలో ఏర్పాటవుతున్న సెల్ టవర్లు, జాతీయ రహదారులు 26, 326ల సమస్యలు, భారత మాల ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణాల గురించి సభ్యులు వివరాలు అడిగారు. చాలా ప్రశ్నలకు అధికారులు తగిన సమాచారం లేదని బదులిచ్చారు. మరోసారి ఇలా వస్తే కుదరదని ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. సమావేశంలో కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉల్కా, కలెక్టర్ వి.కీర్తి వాసన్, జెడ్పీ ప్రెసిడెంట్ సస్మితా మెలక, ఎమ్మెల్యే పవిత్ర శాంత, రాం చంద్రఖడం, రఘురాం మచ్చో పాల్గొన్నారు.

పశువుల వాహనం సీజ్

ఎచ్చెర్ల క్యాంపస్: పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని పోలీసులు బుధవారం నవభారత్ సమీపంలో జాతీయ రహదారిపై పట్టుకున్నారు. 19 పశువులను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణా చేస్తున్న గొర్లె బాబ్జీపై కేసు నమోదు చేశారు. పశువులను కొత్తవలస గో సంరక్షణ కేంద్రానికి తరలించారు.

రావివలసలో మహిళపై దాడి

టెక్కలి రూరల్: రావివలస గ్రామానికి చెందిన కె.శకుంతల అనే మహిళపై బుధవారం ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. గ్రామంలో జరుగుతున్న అమ్మవారి ఉత్సవాల సందర్భంగా బాధిత మహిళ ఇంటి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో భోజనాలను ఏర్పాటు చేశారు. అయితే ఆ స్థలానికి సంబంధించి చిన్న పాటి వాగ్వాదం జరగడంతో మహిళపై ముగ్గురు వ్యక్తులు దాడిచేసి గాయపరిచారు. అనంతరం బాధితురాలిని చికిత్స కోసం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించారు.

వలస కార్మికుడు దుర్మరణం

హిరమండలం: వంశధార ఫేజ్-2 రిజర్వాయర్ నిర్మాణ పనులకు వచ్చిన ఓ వలస కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వంశధార ఫేజ్-2 రిజర్వాయర్ నిర్మాణ పనులకు ఇటీవల ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వారికి హిరమండలంలో సంబంధిత కాంట్రాక్టర్ వసతి కల్పించారు. మేజర్ పంచాయతీలోని ఓ ఇంట్లో చాలామంది కార్మికులు ఉంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం వేకువజామున మహారాష్ట్రలోని నాగపూర్ జిల్లాకు చెందిన కమలేష్‌ఠాకూర్ (41) అనే కార్మికుడు నిద్రమత్తులో డాబా పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తోటి కార్మికులు హుటాహుటిన స్థానిక ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ వైద్యుల సూచన మేరకు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కమలేష్ బుధవారం మృతిచెందాడు. నాగపూర్‌లోని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. హిరమండలం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

• అష్ట ఫలాలతో శిఖరాభిషేకం



జిల్లా కేంద్రంలోని పుణ్యపువీధిలో సీతారామచంద్రమూర్తి సహిత సువత్సల అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద బుధవారం మహాకుంభాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శిఖరానికి అష్ట ఫలాలతో అభిషేకం చేశారు. – శ్రీకాకుళం కల్చరల్

9.2 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం టౌన్: ఒడిశా నుంచి కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌కు 9.2 కిలోల గంజాయి తరలిస్తున్న గమేష్‌నాయిక్ అనే వ్యక్తిని ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద అరెస్ట్ చేసినట్టు సీఐ ఎం.చిన్నంనాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఇచ్ఛాపురం పట్టణ పోలీసులు రైల్వేస్టేషన్ సమీపంలో తనిఖీలు జరుపుతుండగా గమేష్‌నాయిక్ అనుమానాస్పదంగా కనిపించాడు. అతనిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 9.2 కిలోల గంజాయి పట్టుబడింది. ఒడిశా రాష్ట్రం గేరేగేడి గ్రామానికి చెందిన ఈయన కుటుంబ పోషణకు డబ్బులు చాలక గంజాయి రవాణాకు దిగాడు. కంధమల్ జిల్లా తిలోరి గ్రామానికి చెందిన అజిత్‌ప్రధాన్, సుభాష్‌ల వద్ద కిలో గంజాయి రూ.రెండు వేలకు కొని మైసూర్‌లో బబ్లూకుమార్‌కు కిలో రూ.పది వేలకు అమ్మడానికి ఒప్పందం చేసుకున్నాడు. ఈ క్రమంలో గంజాయి తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ తనిఖీలలో పట్టణ ఎస్ఐ ముకుందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు- ఆటో ఢీ

- డ్రైవర్‌తో సహా 12 మందికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో, ఆర్టీసీ బస్సు

గార: కళింగపట్నం నుంచి బందరువానిపేటకు వెళ్లే రోడ్డులో ఆర్టీసీ బస్సు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్‌తో సహా 12 మందికి గాయాలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో బందరువానిపేటలో ఒకే కుటుంబానికి చెందిన 14 మంది కుందువానిపేట పండగకి వెళ్లి తిరిగి ఇంటికి ఆటోలో బయలుదేరారు. అదే సమయంలో కె.మత్స్యలేశం గ్రామశివారులోని మలుపు వద్ద బందరువానిపేట నుంచి వస్తున్న ఆర్టీసీ బస్‌ను ఢీకొట్టారు. స్థానికుల సమాచారంతో క్షతగాత్రులను రెండు అంబులెన్సుల ద్వారా తొలుత కళింగపట్నం పీహెచ్‌సీకి, అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. వీరిలో గనగళ్ల లక్ష్మీ, దేవిశ్రీ కాలుకు గాయాలవ్వగా.. అప్పారావుకు బలమైన గాయమైంది. డ్రైవర్‌తో పాటు మరో ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. గార ఏఎస్ఐ ఎం.చిరంజీవులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపారు.

శ్రీకాకుళం టు సుప్రీం కమాండర్



కేశవరావు(ఫైల్)

సొంతూరికి దూరంగా దాదాపు నాలుగు దశాబ్దాల అజ్ఞాత వాసం ముగిసిపోయింది. ఎంటెక్ చదివినా ఏళ్లకు ఏళ్లు చేసిన అరణ్య వాసం పూర్తయ్యింది. కలాన్ని వదిలి తుపాకీ చేతబట్టిన ఆయన జీవితం ఆ తుపాకీ గుళ్లకే బలైపోయింది. జియ్యన్నపేటలో పుట్టి.. టెక్కలిలో చదివి.. వరంగల్‌లో ఉన్నత విద్యాభ్యాసానికి వెళ్లి.. ఆపై అడవిలో అన్నగా మారిన నంబాళ్ల కేశవరావు అలియాస్ బసవరాజు ప్రస్థానం ముగిసిపోయింది. చత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో కేశవరావు హతమయ్యారు. ఈ ఘటనతో సిక్కోలు ఉలిక్కిపడింది.

- నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత నంబాళ్ల కేశవరావు హతం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం, పలాస :

నలభై ఏళ్ల కిందట ఓ విద్యార్థి అకస్మాత్తుగా ఇంటికి వచ్చి.. తన వాటా ఆస్తి రాసిచ్చేయాలని టీచరైన తండ్రిని కోరారు. ఎందుకని అడిగితే ఆస్తి ఇస్తే.. పేదలకు పంచేస్తా అని చెప్పారు. ఆ విద్యార్థే నంబాళ్ల కేశవరావు. విద్యార్థిగా ఊరి నుంచి, కుటుంబం నుంచి వెళ్లిన కేశవరావు విగతజీవిగా మారారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు అజ్ఞాత వాసం చేసి అడవిలోనూ ఊపిరి వదిలేశారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నంబాళ్ల కేశవరావు అలియాస్ బసవరాజు చనిపోయినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ ఘటనతో సిక్కోలు ఉలిక్కి పడింది. నంబాళ్ల స్వగ్రామమైన కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేటలో విషాద ఛాయలు అలముకున్నాయి.

చిన్నప్పుడు తెలివైన విద్యార్థి, మెరుగైన కబడ్డీ ప్లేయర్‌గా మన్ననలు అందుకున్న కేశవరావు కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామానికి చెందిన నంబాళ్ల వాసుదేవరావు (ఉపాధ్యాయుడు) లక్ష్మీనారాయణమ్మ దంపతులకు 1955లో జన్మించారు. 1 నుంచి 5 వరకు స్వగ్రామమైన జియ్యన్నపేటలో ప్రాథమిక విద్యనభ్యసించారు. ఆ తర్వాత 6 నుంచి 10 వరకు టెక్కలి మండలం తలగాం ఎట్ నౌపడ ఆర్ఎస్‌లో విద్యనభ్యసించారు. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ పూర్తి చేసి 1971 లో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ కోర్సులో చేరారు. ఏడాది తర్వాత వరంగల్ రీజినల్ ఇంజినీరింగ్ కళాశాలలో చేరారు. ఆ తర్వాత అక్కడే ఎంటెక్‌లో చేరారు. అటు నుంచి అటే అడవి బాట పట్టారు. కేశవరావు మరణంతో కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆ గ్రామం ప్రస్తుతం గుంభనంగా ఉంది. గతంలో ఒకటి రెండు మార్లు కేశవరావుమృతి వదంతులపై కొందరు స్పందించడంతో వారిని పోలీసులు విచారించారు. దీంతో ప్రస్తుతం ఎవరూ బయట పడడం లేదు.

ఉద్దానంలో..

నంబాళ్ల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారన్న వార్త ఉద్దానంలో దావానలంలా వ్యాపించింది. టెక్కలికి చెందిన ఆయనకు ఈ ప్రాంతం ఉద్యమాలతో నేరుగా సంబంధం లేకపోయినా ఈ ప్రాంతం మావోయిస్టు కేడరుకు, నాటి పీపుల్స్ వార్ పార్టీ కేడరుకు దిశానిర్దేశం చేసిన వ్యక్తి కావడంతో మృతి వార్తతో ఉద్దానం ఉలిక్కిపడింది. పోలీసు వర్గాలు ముందుగా పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి ఈ సమాచారం అందించి మృతదేహాన్ని తీసుకొని రావడానికి ఎవరైనా వెళ్తున్నారా అని అడిగారు. తమ గ్రామానితో ఎలాంటి బంధుత్వం లేదని, రాజకీయ బంధుత్వం మాత్రమే ఉందని వారు చెప్పారు. ఒక నాటి పీపుల్స్ వార్‌లో, నేటి మావోయిస్టు పార్టీలో పనిచేసి ఈ ఉద్దానం ప్రాంతంలో సుమారు 60మంది వరకు కార్యకర్తలు, నాయకులు పోలీసు ఎన్‌కౌంటర్లలో మృతి చెందారు. నంబాళ్ల కేశవరావు మృతితో ఇక నాయకత్వ స్థానాల్లో ఈ జిల్లా నుంచి ఎవరూ లేరనే తెలుస్తోంది. ఆయన మృతదేహం తీసుకురావడానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు, మాజీ మావోయిస్టు నాయకులు బయల్దేరి వెళ్తున్నట్టు ఉద్దానం వాసులు చెబుతున్నారు.



జియ్యన్నపేటలోని కేశవరావు స్వగృహం

ఎన్‌కౌంటర్‌కు ఖండన

చత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ మడ్ అడవుల్లో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌ను సి.పి.ఐ.ఎం.ఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు ఖండించారు. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఆయన కోరారు. మావోయిస్టు పార్టీ శాంతి చర్చలు కోరినా వాటిని తిరస్కరించి మన దేశపౌరులైన మావోయిస్టులను ఉగ్రవాదులపై దాడుల కన్నా ఎక్కువగా దాడి చేసి దండకారణ్యంలో ఒక భయంకరమైన వాతావరణాన్ని సృష్టించడం అప్రజాస్వామికమని, పౌర సమాజం వీటిపై తీవ్రంగా స్పందించాలని కోరారు.



కేశవరావు మృతదేహం

ఉపాధిలో బినామీ మస్తర్లు..!

- మేట్ల అండతో కూటమి నేతల దోపిడీ
- ప్రభుత్వ ఉద్యోగులు సైతం పనికి వస్తున్నట్లు మస్తర్లు
- లక్షలాది రుపాయలు స్వాహా

విజయనగరం ఫోర్ట్:

☛ గంట్యాడ మండలం నరవ గ్రామంలో ఎస్.సత్యనారాయణ అనే వ్యక్తి ఉపాధి హామీ పనికి వెళ్లకపోయినా వెళ్లినట్లు మస్తరు వేశారు. ఆయన విజయనగరం కలెక్టరేట్‌లోని సర్వశిక్ష అభియాన్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. మే నెలలో ఆయన పనికి వెళ్లినట్లు మస్తర్ వేయగా ఆయనకు రూ.1260 వేతనం జనరేట్ అయింది.

☛ ఇదే గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే మరో వ్యక్తి విశాఖ జిల్లా పద్మనాభం మండలంలో ఉన్న ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఈయన ఏప్రిల్, మే నెలల్లో పనికి వెళ్లినట్లు మస్తర్ వేశారు. దీంతో ఈ అధ్యాపకుడికి మూడు వారాలకు గాను రూ.3356 వేతనం జనరేట్ అయింది. వీరితో పాటు మరి కొంతమందికి కూడా బినామీ మస్తర్లు వేశారని గ్రామ సర్పంచ్ పతివాడ భాస్కరరావు ఎంపీడీఓ ఆర్‌వీ రమణమూర్తికి ఫిర్యాదు చేశారు.



విజయనగరం మండలంలో పనిచేస్తున్న వేతనదారులు

ఈ ఒక్క గ్రామంలోనే కాదు. జిల్లాలోని అనేక చోట్ల బినామీ మస్తర్లు వేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల బయటపడుతున్నాయి. మరి కొన్ని చోట్ల గుట్టుగా సాగి పోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. బినామీ మస్తర్ల పేరిట ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోకుండా అధికారులు చోద్యం చూడడం వల్లే ఉపాధి హామీలో అక్రమాలు పెరిగిపోతున్నాయనే వ్యాఖ్యానిస్తున్నారు.

కూటమి సర్కార్ వచ్చాక పెరిగిన అవినీతి

కూటమి సర్కార్ రాష్ట్రంలో ఏర్పాటైన తర్వాత ఉపాధి హామీ పథకంలో అవినీతి పెచ్చు మీరుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో పనిచేసిన మేట్లను తొలగించి కూటమికి చెందిన సానుభూతిపరులను మేట్‌లుగా నియమించుకున్నారు. అధికారులు కూడా కూటమి నేతల ఆదేశాలకు వంత పాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఎస్.సత్యనారాయణకు జనరేట్ అయిన రూ.1260 పేమెంట్ ఆర్డర్



సత్యనారాయణకు జనరేట్ అయిన 3356 పేమెంట్ ఆర్డర్

ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగుల పేరిట మస్తర్లు

ఉపాధి హామీ పథకంలో డబ్బులు దోచేందుకు అడ్డదారులను వెతుకుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగం, ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న వారి పేరిట బినామీ మస్తర్లు వేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది మేట్‌లైతే తమ భార్య/భర్తల పేరిట బినామీ మస్తర్లు వేస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కూటమి నేతలు నియమించుకున్న మేట్‌ల ద్వారా బినామీ మస్తర్లు వేసుకుని కాసులు దండుకుంటున్నట్లు విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అక్రమాలు జరుగుతున్నా అధికార పార్టీ వారు కావడంతో అధికారులు ఏమీ అనకుండా చూసీచూడనట్లు ఉంటున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. బినామీ మస్తర్ల ద్వారా లక్షలాది రుపాయలు దండుకుంటున్నట్లు సమాచారం. జిల్లాలో 3.53 లక్షల జాబ్ కార్డులు ఉండగా అన్నీ యాక్టివ్‌లో ఉన్నాయి. జిల్లాలో 6.08 లక్షల వేతనదారులు ఉన్నారు. వారిలో 5.95 లక్షల మంది వేతనదారులు ఉపాధి పనులకు వెళ్తారు.

బినామీ మస్తర్లపై విచారణ చేపట్టి చర్యలు

ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నాం.

ఎస్.శారదా దేవి, పీడీ, డ్వామా

క్లుప్తంగా

అంకితభావంతో పని చేయాలి

- జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



పదోన్నతి ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాల్సిన బాధ్యత ఉద్యోగుల పట్ల ఉందని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు జిల్లా పరిషత్ కార్యాలయంలో సహాయకులుగా పని చేస్తున్న 6గురు సిబ్బందికి రికార్డు అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పిస్తూ బుధవారం ఆయన ఉత్తర్వులు అందజేశారు. ఈ క్రమంలో సీహెచ్.సీతమ్మ, టి.రాములు, డి.రామస్వామి, ఆర్.సింహాచలం, జి.వెంకటరత్నం, ఎం.వెంకటరమణలకు జామి, మెట్టపల్లి, నాగూరు, బలిజిపేట, చింతాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు విజయనగరం జిల్లా పరిషత్‌లో మరొకరిని రికార్డ్ అసిస్టెంట్‌గా నియమించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ బీవీ. సత్యనారాయణ, డిప్యూటీ సీఈఓ ఆర్.వెంకట్‌రామన్ తదితరులు పాల్గొన్నారు.

సారాతో నలుగురి అరెస్టు



కారుతో పాటు పట్టుబడిన నిందితులు

పాలకొండ: సారా తరలిస్తున్న కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను ఆమె బుధవారం స్థానిక విలేకరులకు వివరించారు. వీరఘట్టం మండలం మోకాసరాజపురం గ్రామ సమీపంలో జలుమూరు ప్రశాంత్‌కుమార్, వడ్డి సునీల్‌లు 160లీటర్ల సారాను కారులో తరలిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే వీరఘట్టం ఎస్సీ కాలనీలో దాడులు చేయగా బండి కస్తూరి ఐదు లీటర్ల సారాతోను, సిరిపురం ఉష మరో ఐదు లీటర్ల సారాతోను పట్టుబడినట్లు తెలిపారు. సారాతో పాటు కారును సీజ్ చేశామని, నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించామని వివరించారు. ఈ దాడుల్లో పాలకొండ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారని చెప్పారు.

కొండ దిగిన ఏనుగుల గుంపు



ఘనసర సమీపంలోని ఐలమ్మ తోట దగ్గర ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని ఘనసర రైతులకు ఏనుగుల కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. కొంతకాలంగా తివ్వాకొండల్లోకి ఏనుగులు వెళ్లడంతో ఊపిరి పీల్చుకున్న రైతులకు మళ్లీ కష్టం వచ్చిపడింది, బుధవారం భామిని మండలం ఘనసర గ్రామాన్ని ఆనుకుని ఉన్న ఐలమ్మ తోటలో నాలుగు ఏనుగుల గుంపు ప్రత్యక్షమైంది.తివ్వాకొండల్లో తాగునీటికి విలవిలలాడి కొండ దిగి వచ్చినట్లు ఫారెస్టు అధికారులు భావిస్తున్నారు.తిరిగి ఎలిఫెంట్ ట్రాకర్స్, ఫారెస్టు సిబ్బందికి ఏనుగుల రక్షణ బాధ్యతలు ఆరంభమయ్యాయి.

బావిలో పడి మతిస్థిమితంలేని మహిళ మృతి

రాజాం సిటీ: కుమారుడు మృతిచెందడంతో మతిస్థిమితం కోల్పోయిన ఓ మహిళ నేల బావిలో పడి మృతిచెందింది. బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్సై వై.రవికిరణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన పోతిరెడ్డి కుమారి (45) ఏడాది క్రితం రాజాం వచ్చి గాయత్రి కాలనీలో నివాసం ఉంటోంది, ఆమె రెండో కుమారుడు నరేంద్ర నాలుగేళ్ల క్రితం మృతిచెందాడు. దీంతో ఆమె అప్పటినుంచి మానసికంగా ఇబ్బందులు పడి మతిస్థిమితం కోల్పోయి అనారోగ్యం పాలైంది. దీంతో కుటుంబసభ్యులు పలు ఆస్పత్రులకు తీసుకువెళ్లి వైద్యసేవలు అందించారు. అయినప్పటికీ అప్పుడప్పుడు బయటకు వెళ్లిపోవడం కుటుంబసభ్యులు వెతికి తీసుకురావడం పరిపాటిగా మారింది. నాలుగు రోజుల క్రితం తన పెద్దకుమారుడు సాయితేజ రాగోలు జెమ్స్‌కు తీసుకువెళ్లి చికిత్స అనంతరం మృతురాలి తమ్ముడైన తెలగవీధిలో నివాసం ఉంటున్న కొనిశెట్టి ఉమామహేశ్వరరావు ఇంటి వద్ద ఉంచారు. ఈ నెల 20వ తేదీ రాత్రి ఇంటి నుంచి ఆమె బయటకు వెళ్లిపోయిన విషయాన్ని బుధవారం కుటుంబ సభ్యులు తెలుసుకుని అన్ని ప్రాంతాల్లో వెతికారు. తెలగవీధి శ్మశానవాటిక వెనుక భాగంలోని నేలబావిలో ఆమె మృతదేహం గుర్తించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మతిస్థిమితం లేక బావిలోపడి మృతిచెందినట్లు మృతురాలి కుమారుడు సాయితేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు.

కొమ్ము వాగు ఆక్రమణ

- తహసీల్దార్‌కు మోదుగుల పేట గ్రామస్తుల ఫిర్యాదు
- స్థలాన్ని పరిశీలించిన వీఆర్‌ఓ



రైతులతో మాట్లాడుతున్న వీఆర్‌ఓ



కొమ్మువాగులో పోసిన రాళ్లు, మట్టి

సంతకవిటి: మండలంలోని మామిడిపల్లి రెవెన్యూ పరిధి పైలవాని చెరువు, గూణాపు చెరువు కొమ్ము వాగును మోదుగులపేట గ్రామానికి చెందిన వాకమల్లు సూర్యనారాయణ, వాకమల్లు చిన్నారావులు, రాళ్లు, మట్టి పోసి ఆక్రమణ చేస్తున్నారని సోమవారం మోదుగులపేట గ్రామానికి చెందిన పలువురు రైతులు తహసీల్దార్ బి.సత్యంకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్‌ఓ వి.వెంకటరమణ బుధవారం గ్రామానికి చేరుకుని, సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు అధిక సంఖ్యలో అక్కడికి చేరున్నారు. ఈ క్రమంలో రైతులు ఆక్రమణ దారులకు వాగ్వాదం జరిగింది. వీఆర్‌ఓ ఇరుపక్షాలతో మాట్లాడి ఈ విషయంపై అధికారుల దృష్టిలో పెట్టి, సర్వే చేయించి సమస్యకు పరిష్కారం చూపుతామని తెలిపారు.

టీడీపీ ప్రధాన నాయకుడి ఆదేశాలతో ఆక్రమణ

మండలంలోని టీడీపీ ప్రధాన నాయకుడి ఆదేశాలతోనే మట్టిపోశామని బాహాటంగానే వీఆర్‌ఓ, రైతుల ఎదుట ఆక్రమణ దారులు చెప్పారు. దీంతో మరోసారి రైతులు, ఆక్రమణ దారుల మధ్య ఘర్షణ జరిగింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన యువకుడు జి.రాకేష్(20) వ్యసనాలకు బానిసై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి వల్లంపూడి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొద్దాం గ్రామానికి చెందిన జి.రాకేష్ తండ్రి వెంకటసత్యం ఎస్.కోట సర్కిల్ పరిధిలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ పదినెలల క్రితం విద్యుత్ ఘాతంతో మరణించారు. అప్పటినుంచి రాకేష్ వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ నెల 11న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు ఎస్.కోట సామాజిక ఆసుత్రిలో ప్రథమ చికిత్స అనంతరం విజయనగరంలోని మహారాజా ఆస్పత్రిలో చేర్చారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖలోని కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తల్లి పార్వతి కారుణ్య నియామకంపై కొత్తవలసలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి



కంద్రిక నారు మృతదేహం

పార్వతీపురం రూరల్: మండలంలోని రావికోన పంచాయతీ రంగాలగుడ గ్రామంలో వివాహానికి హాజరైన ఒడిశాకు చెందిన ముగ్గురు యువకుల్లో ఒకరు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ దుర్ఘటన వివరాలిలా ఉన్నాయి. పెళ్లికి వెళ్లిన యువకులు ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణంలో వెళ్తుండగా రంగాలగూడ గ్రామం మలుపు వద్ద ఒడిశా నుంచి ఎదురుగా వస్తున్న పౌల్ట్రీ వ్యాన్ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న యువకులు రోడ్డుపై పడిపోగా తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు హుటాహుటిన పార్వతీపురం కేంద్రాస్పత్రికి 108 సాయంతో తరలించగా మార్గమధ్యంలో కంద్రిక నారు అనే వ్యక్తి మృతిచెందాడు. మరో ఇద్దరు యువకులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ముగ్గురి యువకులను ఒడిశాలోని అలమండ పంచాయతీ జగ్గుగూడ గ్రామానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదానికి సంబంధించి పార్వతీపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఆర్‌పీ ఉల్లంఘన జరగలేదు

- ఎక్సైజ్ సీఐ వెంకట్రావు



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ వెంకట్రావు

నెల్లిమర్ల రూరల్: మద్యం అమ్మకాల్లో ఎలాంటి ఎంఆర్‌పీ ఉల్లంఘన జరగలేదని ఎక్సైజ్ సీఐ వెంకట్రావు స్పష్టం చేశారు. నెల్లిమర్ల మండలంలోని సతివాడ మద్యం దుకాణంలో ఎంఆర్‌పీకి అదనంగా మద్యం అమ్ముతున్నారని పలువురు మద్యం ప్రియులు ఇచ్చిన ఫిర్యాదుపై బుధవారం ఆయన స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంత మంది వ్యక్తుల ఫిర్యాదుతో సతివాడలో మద్యం దుకాణాన్ని పరిశీలించి విక్రయాలపై ఆరా తీశామన్నారు. కొత్త ధరలపై పాత స్టిక్కర్లు ఉండడమే ఈ విధమైన ఆరోపణలకు ప్రధాన కారణంగా గుర్తించామని చెప్పారు. నెల్లిమర్ల పట్టణంలో ఉన్న మద్యం డిపోను కూడా సందర్శించి ధరలను సరిచూశామని తెలిపారు. సిగ్నేచర్ విస్కీ క్వార్టర్ బాటిల్ పాత ధర రూ.330గా ఉండేదని, ప్రస్తుతం పెంచిన ధరతో రూ.350గా అమ్మకాలు సాగుతున్నాయన్నారు. పాత స్టిక్కర్ రూ.330 బాటిల్‌పై ఉండడంతో మద్యం తాగేందుకు వచ్చిన వారు ఫిర్యాదు చేశారని, ప్రస్తుత ధరతోనే షాపులో అమ్మకాలు జరిగాయని స్పష్టం చేశారు. మండల వ్యాప్తంగా ఏ మద్యం షాపులోనూ పైసా కూడా అదనంగా తీసుకోవడం లేదని చెప్పారు. నిత్యం షాపులపై తనిఖీలు జరుపుతున్నామని, ఎంఆర్‌పీని ఉల్లంఘిస్తే షాపులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

విజేతల స్ఫూర్తితో ముందుకు సాగాలి

- సైనిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి మజ్జి కృష్ణారావు
- టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన ఆశ్రమ విద్యార్థులకు అభినందన



టెన్త్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన ఆశ్రమ విద్యార్థులను ప్రశంసా పత్రంతో సత్కరిస్తున్న దృశ్యం

విజయనగరం గంటస్తంభం: సమాజంలో నేటితరం విద్యార్థులకు అనేక సవాళ్లు ఉన్నప్పటికీ లక్ష్యసాధనకు కసిగా కృషి చేయాలని విజయనగరం జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి మజ్జి కృష్ణారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం జామి మండలంలోని అట్టాడ గ్రామంలో గల బీఎస్‌ఆర్ ఆశ్రమంలో జిల్లా పౌరవేదిక, ఎన్‌వీఎన్ బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో సత్తా చాటిన విద్యార్థులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు నిరంతరం జాతీయ, అంతర్జాతీయ విజేతల జీవిత ఘట్టాలు చదవాలని వారినుంచి స్ఫూర్తి పొందాలని గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు సాధించిన విజయాలను చూసి చదువు పట్ల ఆసక్తి ఉన్నవారికి ఉత్సాహం కలుగుతుందన్నారు. విశ్రాంత చీఫ్ బ్యాంకింగ్ అధికారి పిడకల ప్రభాకరరావు మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉత్తమ ప్రతిభను చూపిన విద్యార్థులను చూస్తుంటే చాలా గర్వంగా ఉందన్నారు. చదువుతో పాటు విద్యార్థులకు క్రమశిక్షణ చాలముఖ్యమని పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు చాలా ఆరాటపడుతుంటారనే విషయాన్ని విద్యార్థులు మరిచిపోకూడదని హితవు పలికారు. పాఠశాలల వారీగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అతిథులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, ఎన్‌వీఎస్ బ్లడ్ బ్యాంక్ అధినేత తాడేపల్లి నాగేశ్వరరావు, తుమ్మగంటి రాంమోహన్‌రావు, ఇప్పలవలస గోపాలరావు, ఆశ్రమం నిర్వాహకులు భీశెట్టి శారద, ఆదారి హరిత సాయి తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ కేసులో ఇద్దరు అరెస్ట్

విశాఖ సిటీ: ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో ప్రధాన ముద్దాయికి సహకరిస్తున్న ఇద్దరు వ్యక్తులను సైబర్ క్రైం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ కొద్ది రోజుల కిందట అరెస్టయిన ప్రధాన ముద్దాయి ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా పోలీసులు నిఘా పెట్టారు. ఇందులో విజయనగరం జిల్లాకు చెందిన గండి గణేష్, పల్లి రామకృష్ణ మధురవాడలో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. నిందితులు బెట్టింగ్‌కు ఉపయోగించిన రెండు స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

సూర్యప్రకాష్‌కు విజనరీ ఇండియన్స్ అవార్డు



విజనరీ ఇండియన్స్ అవార్డు అందుకున్న డా.సూర్యప్రకాష్ (ఫైల్)

గరుగుబిల్లి: విభిన్న రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారిని కేంద్ర ప్రసార భారతి మంత్రిత్వశాఖ గుర్తించి విజనరీ ఇండియన్స్ అవార్డులను అందజేసింది. ఇందులో భాగంగా గరుగుబిల్లి మండలంలోని రావుపల్లి గ్రామానికి చెందిన డా.గుల్ల సూర్యప్రకాష్ హైదరాబాద్‌లోని కేర్ హస్పిటల్‌లో కార్డియాలజిస్టుగా విధులను నిర్వహిస్తున్న ఆయన విజనరీ ఇండియన్స్ అవార్డుకు ఎంపిక కాగా ప్రసిద్ధ బాలీవుడ్ నటి పూనమ్ ధిల్లాన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఆయన కేర్ ఆస్పత్రిలో సేవలను అందిస్తూనే ఈ ప్రాంతీయులకు సేవలను అందించాలనే ఉద్దేశంతో మండలంలోని రావుపల్లి, కొత్తూరు తదితర గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించి వందలాదిమందికి సేవలను అందిస్తున్నారు. చిరకాలంగా వైద్యసేవలను అందిస్తూ ఈ ప్రాంతీయుల మన్ననలను పొందుతున్నారు. ఇటు ఆంధ్రప్రదేశ్‌లో అటు తెలంగాణ రాష్ట్రంలో సేవలను అందిస్తున్నారు. ఆయన సమాజానికి చేస్తున్న సేవలను గుర్తించి కేంద్రప్రసార భారతి మంత్రిత్వశాఖ ఈనెల 18న న్యూ ఢిల్లీలోని ఆకాశవాణి భవనంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డా.సూర్యప్రకాష్‌కు విజనరీ ఇండియన్స్ అవార్డును బహూకరించింది. ఆయన ప్రత్యేక అవార్డును అందుకోవడంపట్ల గ్రామసర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు, మాజీ సర్పంచ్ గుల్ల కాశినాయుడు, అన్నపూర్ణమ్మ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మామిడి కాయలు నిల్వ చేసిన ఇళ్లపై విజిలెన్స్ తనిఖీలు



మామిడి కాయలకు ఉపయోగించిన కెమికల్స్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

గంట్యాడ: మండలంలోని రామవరం గ్రామంలో కాకర్లపూడి రామకృష్ణరాజు, సిరపురపు శివ అనే వ్యక్తుల ఇళ్లలో నిల్వ చేసిన మామిడి కాయలపై విజిలెన్స్, ఆహార తనిఖీ అధికారులు సంయుక్తంగా బుధవారం తనిఖీలు నిర్వహించారు. రామకృష్ణ రాజు, శివలు పండించిన మామిడి కాయలకు మంచి రంగు వచ్చి ఆకర్షణీయంగా కనబడడానికి, తద్వారా పళ్లను ఎక్కువ ధరకు అమ్ముకోవడానికి మామిడి కాయలకు ఈపి-50, రిఫాన్ అనే కెమికల్ ద్రావణం ఉపయోగించి రంగు వచ్చిన తర్వాత మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ ఈ విధంగా కృత్రిమంగా కెమికల్స్ వాడి మామిడి కాయలు పండించరాదన్నారు. ఇలా పండించడం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. కృత్రిమంగా కెమికల్స్ వాడి మామిడి కాయలు పండించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. ఆహార భద్రత అధికారులు కెమికల్ స్ప్రే చేసిన మామిడి కాయల నమూనాను సేకరించి వాటిని రసాయన పరీక్ష నిమిత్తం నాచారాం, హైదరాబాద్‌కు పంపి దాని రిపోర్ట్ అధారంగా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఈ తనిఖీలో విజిలెన్స్ అధికారులు సీఐ సింహాచలం, హెచ్‌సీ కామేశ్వరావు, పురుషోత్తం పాల్గొన్నారు.

ప్రమాదంలో మానవ మనుగడ..!

మనిషి ప్రతి అవసరానికి ప్రకృతిపై ఆధారపడి జీవించాల్సి ఉంది. ప్రకృతి లేనిదే మనిషి లేడు. వ్యవసాయ పద్ధతులైనా, ఆహారపు అలవాట్లయినా, మానవ ధర్మాలైనా, జీవన విధానమైన సృష్టి చక్రానికి లోబడి ఉండాలి.

\- భారతీయ మహర్షులు

- అంతరించిపోతున్న జీవజాతులు
- ప్రమాదంలో జీవసంపద
- మేల్కొనకుంటే ముందుతరాలకు ముప్పు
- నేడు అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం



రాజాం సిటీ: భూమిపై జీవాల మధ్య భేదమే జీవ వైవిధ్యం. ప్రపంచంలో మిలియన్ జాతుల జీవాలు ఉన్నాయి. నేడు భూమి వేడెక్కిపోతోంది. కాలుష్యం అధికమవుతోంది. అడవులు, వన్యప్రాణులు అంతరించిపోతున్నాయి. పర్యావరణ మిత్ర జాతులు అంతరించిపోయి ప్రమాదకర కీటకజాతులు పుట్టుకొస్తున్నాయి. టెక్నాలజీని రుచిమరిగిన మానవ మనుగడ ఈ టెక్నాలజీ కారణంగా నష్టపోతున్న ఇతర జాతుల గురించి పట్టించుకోవడం లేదు.

అంతరిస్తున్న జీవజాతులు

ప్రపంచంలో పలు జీవజాతులు అంతరించిపోతున్నాయి. వాటిని కాపాడాలనే ఉద్దేశంతో పర్యావరణ ప్రేమికులు విస్తృత ప్రచారాలు, పోరాటాలు చేస్తున్నారు. ఐక్యరాజ్యసమితి జీవజాతుల పరిరక్షణ నిమిత్తం మే 22న అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం నిర్వహిస్తోంది. 1992 మే 22 నుంచి ఈ అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం నిర్వహిస్తూ వస్తున్నారు.

గిరిజన ప్రాంతాల్లో రక్షణగా..

మన దేశంలో ఆదివాసీలు ఉన్న ప్రాంతాల్లో జీవవైవిధ్యం రక్షణగా ఉన్నట్లు ఒక అధ్యయనం తెలుపుతోంది. ప్రధానంగా మేఘాలయ, నాగాలాండ్, మిజోరం, అరుణాచల్ ప్రదేశ్‌లలో 80 శాతానికి పైగా గిరిజనులు ఉన్నారు. ఈ ప్రాంతాల్లో జీవవైవిధ్యం, ప్రకృతి సంపద పుష్కలంగా ఉంది. మన రాష్ట్రంలో గిరిజన తెగలు జీవిస్తున్న ప్రాంతాల్లో జీవ వైవిధ్యం ఉన్నప్పటికీ పాలకుల్లో సమన్వయం లేక పోవడంతో అక్కడ కూడా యాంత్రీకరణ పెరిగి జీవవైవిధ్యం కనుమరుగవుతోంది.

జన్యుమార్పిడితో ఇబ్బందులు..

జన్యుమార్పిడి విధానం ఇటీవల అధికమైంది. ఫలితంగా ఎక్కడికక్కడే సంకరజాతి ఉత్పత్తులు ఎక్కువవుతున్నాయి. వాటి కారణంగా కొత్త విత్తనాలు కూడా మార్కెట్‌లోకి వస్తున్నాయి. జన్యుమార్పిడి వల్ల ఇతర జాతులకు నష్టం వాటిల్లితే భవిష్యత్‌లో మానవ మనుగడకు తీవ్రనష్టం కలిగే ప్రమాదం ఉంది.

పెరిగిపోతున్న కాలుష్యం..

ప్రస్తుతం వాతావరణంలో కాలుష్యం పెరిగిపోతోంది. పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం సైతం తూతూ మంత్రంగానే వ్యవహరిస్తోంది. వాల్టా చట్టాన్ని పూర్తిగా పక్కన పెట్టేసింది. ఎక్కడికక్కడే ఇసుక తవ్వకాలు, చెట్ల నరికివేత, కాలుష్యాన్ని వెదజల్లే మందుసామగ్రి వినియోగించి కొండలు బద్దలుచేయడం, చెరువుల ఆక్రమణ, జనావాసాల మధ్య సెల్‌ఫోన్ టవర్లు నిర్మించడం సాధారణమైపోయింది. వీటికి తోడు కాలం చెల్లిన కాలుష్య వాహనాల వినియోగం, రణగొణ ధ్వనులు, అనుమతులుకు మించి నిర్మాణాలు చేయడం, ప్లాస్టిక్ వినియోగించడం వంటివి జీవావరణానికి నష్టం కలిగిస్తున్నాయి. ఫలితంగా పలు జాతుల పక్షులు అంతరించిపోతున్నాయి.

రసాయన వ్యవసాయం..

ప్రస్తుతం వ్యవసాయం కూడా రసాయన ఎరువుల మయంగా మారిపోయింది. గతంలో కృత్రిమ విత్తనోత్పత్తితో పాటు కృత్రిమ వ్యవసాయం ఉండేది. ప్రస్తుతం రసాయన ఎరువుల వినియోగం అధికం కావడం కారణంగా ఉత్పత్తిచేసే ఆహారపు పంటల్లో కూడా నాణ్యత ఉండడం లేదు. వీటికి తోడు రసాయన ఎరువుల కారణంగా పర్యావరణానికి మేలు చేసే కీటకాలు మృతిచెంది, విషజ్వరాలు, రోగాలను వ్యాప్తిచేసే కీటకాలు అధికమవుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు, ప్రజలు మేల్కొనకుంటే మున్ముందు భవిష్యత్ అంధకారమే.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత..

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత. ప్రకృతి సిద్ధమైన వాతావరణానికి, కృత్రిమ వాతావరణానికి చాలా తేడా ఉంటుంది. ప్రస్తుతం ప్రకృతి వైద్యంలో కూడా మన పాత ఆచారాలే ఉంటున్నాయి. ప్రకృతి, తోటి జీవాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

ఆర్‌వీజే నాయుడు, పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్, రాజాం

గంజాయి పట్టివేత



విజయనగరం స్టేషన్‌లో గంజాయితో పాటు నిందితుడిని పట్టుకున్న జీఆర్‌పీ సిబ్బంది

విజయనగరం క్రైమ్: పశ్చిమ గోదావరి జిల్లానుంచి సుమారు 4.5 కేజీల గంజాయిని తరలిస్తుండగా విజయనగరం జీఆర్‌పీ సిబ్బంది బుధవారం స్టేషన్‌లో పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి జీఆర్‌పీ ఎస్సై బాలాజీరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా కోపల్లెకు చెందిన లెంక కరుణానిధి విజయనగరం రైల్వే ప్లాట్ ఫాంపై అనుమానంతో రెండు బ్యాగులతో సంచరిస్తుండగా పట్టుకున్నామన్నారు. నిందితుడి దగ్గర నుంచి రూ.22,500 విలువ గల 4.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం విశాఖ రైల్వే కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



ప్రత్యేకాలంకరణలో సీతారాములు

విజయనగరం టౌన్: నవమి పురస్కరించుకుని, స్థానిక సిటీ బస్టాండ్ వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు గాయత్రీ శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామి కల్యాణం జరగ్గా, సాయంత్రం లక్ష సింధూరార్చన చేశారు. గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా వేకువజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు కోవెళ్ల మారుతీ దీక్షా పీఠంలో స్వామిదీక్షలు తీసుకున్న స్వాములతో అభిషేకాలు, లక్ష రుద్రాక్ష పూజలు, హనుమాన్ చాలీసా పఠనం, హోమాలు వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు.